క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ విద్యాసంవత్సరానికి గాను విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి హమీద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఏప్రిల్ 19లోగా దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా కార్యాలయం (9989803582)లో సంప్రదించాలని తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దుంపలపల్లి వార్డులో వాటర్ ట్యాంక్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడైన బోర్లను తిరిగి వాడుకలోకి తీసుకు రావాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా ఆస్తిపన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని, ఆస్తిపన్ను విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళాకు వచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శరత్‌రావు

బెజ్జంకి(సిద్దిపేట): ప్యాక్స్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు సూచించారు. ఏఎంసీలో గురువారం చైర్మన్ పులి కృష్ణతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాలు సన్‌ఫ్లవర్‌కు రూ.7,280 మద్దతు ధర ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ వాసు, మార్కెట్ కార్యదర్శి వెంకటయ్య, దామోదర్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, భూమ్య, రాజేశం తిరుపతిరెడ్డి, నరేశ్‌బాబు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆత్మరాములకు సన్మానం



ఆత్మరాములను సన్మానిస్తున్న నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): నూతనంగా నియామకమైన జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాధుల ఆత్మరాములును గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆత్మరాములు పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. న్యాయవాద వృత్తిలో ఉండి పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారని చెప్పారు. సమావేశంలో నాయకులు సాయిబాబా, ఎల్లయ్య, సంపత్, రాజు, పవన్ తదితరులు ఉన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.3లక్షల సాయం



ప్రహరీకి భూమిపూజ చేస్తున్న ఎంఈఓ

నంగునూరు(సిద్దిపేట): ప్రహరీ లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిన పారిశ్రామిక వేత్త గురువారం ఆర్థిక సహాయం అందించి చేయూత నిచ్చారు. నర్మేట గ్రామానికి చెందిన రాళ్లబండి వెంకటరమణాచారి హైదరాబాద్‌లో స్థిరపడి పారిశ్రామిక వేత్తగా ఎదిగారు. ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. దానికి స్పందించిన వెంకటరమణాచారి ప్రహరీ, గేటు, వంటగది నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక అందజేశారు. దీంతో ఎంఈఓ దేశిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఎం మనీశ్‌కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజారోహణం.. నాచగిరి పరవశం

- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- సకల దేవతలకు ఆహ్వానం
- పీఠాధిపతులు, ప్రముఖుల సందర్శన



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న రుత్వికులు



స్వామివారి సన్నిధికి వస్తున్న పీఠాధిపతులు మాధవానంద, మధుసూదనానంద సరస్వతి

వర్గల్(గజ్వేల్): ధ్వజారోహణ మహోత్సవంతో నాచగిరి పరవశించింది. అంగరంగ వైభవంగా కొనసాగుతున్న నాచగిరీశుని బ్రహ్మోత్సవాలు భక్తజనావళిని మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ఉత్సవాలలో రెండోరోజు గురువారం నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహక్షేత్రంలో గరుడ ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడాళ్వారు చిత్రంతో కూడిన పతాకానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారు ధ్వజస్తంభం వద్దకు పల్లకిలో ఏతెంచగా, రుత్వికులు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. గరుడ ముద్దలు ఎగురవేస్తూ నైవేద్యం సమర్పించారు. మంగళవాయిద్యాల మధ్య గరుడ పతాకాన్ని ధ్వజస్తంభం శిఖరాగ్రం దాకా ఎగురేశారు. యాగశాలలో సంప్రోక్షణ, హోమం నిర్వహించి, స్వామివారి కల్యాణానికి సన్నాహ సూచికగా సాయంత్రం సకలదేవతాహ్వానం పలుకుతూ ఘనంగా భేరీపూజ నిర్వహించారు.

పీఠాధిపతులకు పూర్ణకుంభ స్వాగతం

నాచగిరి క్షేత్రాన్ని గురువారం పీఠాధిపతులు మాధవానంద సరస్వతి, మధుసూదనానంద సరస్వతి సందర్శించారు. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ పరివారం వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారు స్వామివారిని దర్శించుకొని సేవించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా జడ్జి సాయి రమాదేవి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితర ప్రముఖులు వేడుకలలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ధ్వజారోహణ వేడుకలు తిలకించి తరించారు. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటలకు శ్రీవారి తిరుకల్యాణోత్సవం జరగనుంది.

గజ్వేల్ అభివృద్ధి కేసీఆర్ ఘనతే



కాలువను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

- కాల్వల పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలి: ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌ను అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని బీఆర్‌ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లి, మునిగడప కెనాల్ కాల్వలను బీఆర్‌ఎస్ నేతలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునిగడప పెద్ద చెరువును నింపితే 15 గ్రామాలకు సాగునీటి కొరత ఉండదని చెప్పారు. కాల్వల పనులు పూర్తిచేయాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, కవిత, కిరణ్‌గౌడ్, చంద్రశేఖర్, యాదవరెడ్డి, కనకయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమే గెలిచింది..

గజ్వేల్: ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టివేయడంపై న్యాయమే గెలిచిందని ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

‘రాజీవ్ యువ వికాస్’ వర్తింపజేయండి



హుస్నాబాద్‌రూరల్: మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేటరూరల్: ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకం అగ్రవర్ణ పేదలకు వర్తింప చేయాలని రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి డిమాండ్ చేశారు. పందిల్లలో గురువారం నిర్వహించిన రెడ్డి జేఏసీ సమావేశంలో మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడారు. రెడ్డి సామాజిక వర్గంలో కూడా పేదలు ఉన్నారని, వారిని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో శంకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గాలిరెడ్డి, రాజిరెడ్డి, జానకిరాంరెడ్డి పాల్గొన్నారు. సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



ములుగులో పనులను ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ములుగులో రూ.7 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని, గ్రామాల్లో సీసీరోడ్లు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కాంట్రాక్టర్‌లు పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు సలీం, శ్రీనివాస్, కిష్టారెడ్డి, నర్సింహారెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నాయకులు అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మంజూరు చేయించిన రూ.10 లక్షల నిధులతో మిరుదొడ్డిలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఆరు గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లకు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, దేవరాజు, శ్రీనివాస్, రోశయ్య, సదానందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, చంద్రకుమార్, కరుణాకర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

విమర్శలతో కాలయాపన చేయడం సిగ్గుచేటు

ఎంపీటీసీల ఫోరం

మాజీ అధ్యక్షుడు రవీందర్

కొండపాక(గజ్వేల్): రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విమర్శలతో కాలయాపన చేయడం సిగ్గుచేటని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే దశలో సాగునీరు లేక ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. యాసంగి పంటలు ఎండిపోకుండా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

కూలీలకు వడదెబ్బపై అవగాహన అవసరం

బెజ్జంకి(సిద్దిపేట): తీవ్రమవుతున్న ఎండలతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదమున్నందున ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని కోరారు.

20 శాతం నిధులు కేటాయించాల్సిందే

డీటీఎఫ్ జిల్లానేత చంద్రభాను



మాట్లాడుతున్న చంద్రభాను

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాల్సిందేనని, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రభాను డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు అరకొరగా కేటాయించడం ద్వారా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింలు, మల్లేశం, సంపత్ కుమార్, ఎండీ రఫత్ ఉమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం కొరవడింది

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యం లేకుండా పోయిందని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాకం మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డిలో గురువారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి గొప్పగా చెప్పినప్పటికీ 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 4,843 ఉన్నత పాఠశాలల ప్రస్తావన లేక పోవడం ఆందోళన కలిగిస్తోంని వాపోయారు. రాష్ట్రంలో 662 గురుకులాలకు సొంత భవనాలు లేవని, వాటికి నిధులు కేటాయించక పోవడం శోచనీయమన్నారు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ నోడల్ జిల్లా స్థాయి పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలకు మేడ్చల్, జనగామ, సిద్దిపేట జిల్లాల నుంచి 150 మంది హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లన్న సాగర్ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నెహ్రూయువక కేంద్రం జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం, కళాశాల సీఓఈ డా.గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మధుసూదన్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో 8 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా గురువారం న్యాయమూర్తి రూ.13వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

నేను భానోతు అనిత W/o కిషన్, గ్రామం కొండాపూర్ (శిభ్బితాండ) మం॥ దూళిమెట్ట, జిల్లా సిద్దిపేట. హుస్నాబాద్ బస్టాండ్ సమీపంలో నా యొక్క వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ తేది.08-03-2025 రోజున పోయినది. డాక్యుమెంట్ నెంబర్ 6375/15. దయచేసి దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌కు తెలుపగలరు. సెల్: 9177635684

అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు

సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందిచవద్దని, అలాగే సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ సైదా సూచించారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం షీ టీమ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు షీ టీమ్ ఉందని భరోసా ఇచ్చారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినట్లయితే 100 లేదా షీటీమ్(8712667434)కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వన్నెసా, ఉపాధ్యాయు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం రామేశ్వరంపల్లి ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్ గురువారం పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు, సంబంధిత సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నీలం శ్రీనివాస్ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు భయాన్ని వీడితేనే విజయం సాధిస్తారన్నారు. ఉపాధ్యాయుడు కూరకుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి మార్కులు సాధిస్తే ప్రతి విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున బహుమానంగా ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్మాయిల్, శ్రీనివాస్, రాజేశం, అమృత్, నర్మద పాల్గొన్నారు.

మాచాపూర్ పాఠశాలలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ ఏలేటి రాజిరెడ్డి సహకారంతో గురువారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎంలు బుచ్చిరెడ్డి, రాములు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి వంద శాతం ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ పదవి గొల్లకురుమలకే ఇవ్వాలి

దుబ్బాక: గొల్లకురుమల ఆరాధ్య దైవం రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ పదవిని గొల్ల కురుమలకే కేటాయించాలని ఆ సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. పట్టణంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో గురువారం మండల గొల్ల కురుమ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బట్టు ఎల్లం, చిర్ర తిరుపతి మాట్లాడారు. తమ సంఘాలకు, సంఘాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వెంటనే రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, ఎల్లం, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అక్రమ కేసులు పెడతారా?

దుబ్బాక: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయమని అడిగితే బీఆర్ఎఎస్ నాయకులు, విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసును హైకోర్టు కొట్టి వేయడం కాంగ్రెస్‌కు చెంపపెట్టు అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, స్వామి, కృష్ణ, శ్రీనివాస్, రాజు ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ నిధులుతెస్తే రాజకీయ సన్యాసం

సిద్దిపేటజోన్: రాష్ట్ర బడ్జెట్‌లో సిద్దిపేటకు తీరని అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటకు నిధులు తెస్తే తాము రాజకీయాలకు వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

◆ సమస్యలను పరిష్కరించండి

గజ్వేల్‌రూరల్: కేసీఆర్‌పై విమర్శలు మాని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

◆ కాంగ్రెస్‌ది దుర్మార్గపు పాలన

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీది ప్రాజాపాలన కాదు.. దుర్మార్గపు పాలనని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండిపడ్డారు. సాగునీటి కోసం ఆయన రామగుండం నుంచి చేపట్టిన మహాపాద గురువారం బెజ్జంకి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా బెజ్జంకి క్రాసింగ్‌లో ఆయన మాట్లాడుతూ తలాపున గోదావరి ఉన్నా రైతుల పంటలు ఎండిపోవడం దారుణమన్నారు. మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

◆ ఎంఈఓ విచారణ

దుబ్బాకటౌన్: మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని ఎంఈఓ ప్రభుదాస్ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఫీజు చెల్లింపు అంశాలపై గాయత్రి వివేకానంద పాఠశాల హెచ్‌ఎం విజయ భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అయింది. దీంతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో గురువారం ఎంఈఓ ఆ స్కూల్లో విచారణ జరిపారు. పరీక్షల నిర్వాహణ గురించి తప్పుగా మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ

గజ్వేల్: మండలంలోని రిమ్మనగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం అదే గ్రామానికి చెందిన కామేపల్లి హరీశ్ తన కుమారుడు యోగాన్ష్ జన్మదినం సందర్భంగా రూ.50 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను గురువారం పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి హరీశ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. టీచర్లు భద్రమ్మ, సురేశ్, నాగరాణి, ఆదర్శ కమిటీ చైర్మన్ కృష్ణవేణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.